# మనసు జారితే

(కేంద్రప్రభుత్వ అవార్డు పొందిన నాటకం)

మొదటి రంగం

సమయం: రాత్రి 10 గంటలపైన.

(తెర తీసేసరికి ఒక గది. గదిలో ఒక మూల టేబిలు. కుర్చీలు రెండు చెరి ఒక ప్రక్క ఉన్నాయి. టేబిలుపైన టేబిల్ లాంప్. చిందరవందరగా పుస్తకాలు పడివున్నాయి. గోడలకు వివేకానంద, రామకృష్ణ పరమహంస, గాంధీ, బుద్ధ భగవానుల ఫోటోలున్నాయి. ఒక మూల కూజాలో నీళ్ళు, గ్లాసువున్నాయి. గదికి ఒక ప్రక్క తోలుగమీద చొక్కాలు, పేంట్లు, హేంగర్లతో వ్రేలాడుతూ వున్నాయి.

మనోహర్ ఒక కుర్చీలో కూర్చొని చదువుకోటానికి ప్రయత్నిస్తూ వున్నాడు. చదవటానికి నిద్ర ఆపటానికి చాల ప్రయాసపడుతూ వున్నాడు. మధ్యలో చేతిపైన దోమ వ్రాలితే కొట్టి చంపాడు. రక్తాన్ని చూచి అసహ్యించుకొని, తోలుగుపైని తువ్వాలు తీసి తుడిచాడు. మళ్ళ కూర్చొని చదవాలని ప్రయత్నిస్తున్నాడు. ఉక్కపోస్తున్నట్లు ఫీలయి విసురుకున్నాడు చేతితోనే. పుస్తకం మార్చి మరో పుస్తకం తీసుకున్నాడు. వెంటనే ఆవులించాడు. కొద్దిక్షణాలు అలా సతమతమయాక... పెద్దగా అరుస్తూ—)

మనోహర్: మనసా! ఏమిటే రభస! (మధుతో) ఒరేయ్ మధూ! పాడు మనస్సు నిలకడగా నిలిచి చావదేంరా?

మధు: (తల ఎత్తకుండానే) దాని బుద్ధే అంత.

మనో: (సంతోషంగా) అయితే నా తప్పేం లేదుగా?

మధు: ఉంది దాన్ని నిలకడగా నిలిపివుంచడానికి ప్రయత్నించక పోవడమే.

మనో. (కోపంగా) పోవడమే (వెక్కిరించాడు) ఒరేయ్! యింతసేపటి నుండి ఆ మనస్సుని వెతికివెతికి పట్టుకొచ్చి ఈ పుస్తకంపైన పెట్టాలని ఎంత ప్రయత్నిస్తున్నానో. దాన్ని ఎంత బుజ్జగించి బ్రతిమాలుతున్నానో, అది నా మాట వినక ఎలా జావలాగ జారిపోతున్నదో కళ్ళారా చూస్తూనువ్వే ఇలా...

మధు: మనసు జారితే తప్పు ఆ స్సుది కాదురా.

మనో: మనిషి దంటావు! సరే ఈ సారి ఆ మనస్సుని జారనివ్వకుండా ఇనప సంకెళ్ళు. కాదు స్టెయిన్‌లెస్ స్టీల్ సంకెళ్ళువేసి బంధించేస్తాను. (చప్పట్లు కొట్టి నాటకీయంగా) ఎవరక్కడ?

మధు: (చటుక్కున లేచి చేతులు జోడిస్తూ) ప్రభూ!

మనో: తక్షణమే వెళ్ళి ఆ దుర్మార్గురాలు, చంచల అయిన నా మనస్సుని వెతికి పట్టుకుని స్టెయిన్‌లెస్ స్టీల్ సంకెళ్ళతో బంధించి తీసుకురండు, పొండు.

మధు: చిత్తము మహా ప్రభూ! (రెండడుగులు వెనక్కి నడిచివెడుతూ) ఎక్కడ? మనసా నువ్వెక్కడ? మా రాజుగారి మనసా! రాజ్యాలేలేమనసా! ఎక్కడ? ఎక్కడ? ...ఆఁ యిదిగో నిన్ను పట్టుకుని...(అంటూ మనోహర్ తలని రెండుచేతులతో పట్టుకుని జుట్టు పీకుతున్నాడు.)

మనో: (బాధ పడ్తూ) ఓరీ సేవకుల్లారా! మనస్సును బంధించమంటే జుత్తు పీకుతారేంరా! మనసు, మనస్సునిరా!

మధు: జారిపోతున్నది ప్రభూ!

మనో. స్టెయిన్‌లెస్ స్టీల్ సంకెళ్ళు వేసకెళ్ళాయ కదరా!

మధు: ఆగ్రహించకండి ప్రభూ! కొంచెం ఓపికపట్టండి, యిప్పుడే పట్టుకుంటాము. మీ పాదసన్నిధికి నెట్టుకొస్తాము (జారిపోతున్నట్లు నటించి

## ఇందులో

1. మధు....
   మెడికల్ స్టూడెంటు-వయస్సు 29
2. మనోహర్....
   మధు స్నేహితుడు-వయస్సు 25
3. రాజారావు....
   మధు స్నేహితుడు-వయస్సు 30
4. రఘురామయ్య....
   మధు బాబాయి-వయస్సు 56
5. శారద....
   అనాధ-వయస్సు 18

వస్తారు.

❋

రంగాలు—2

స్థలం—ఒకటే

మనోహర్ ముక్కు పట్టుకుని) ఆఁ దొరికింది ప్రభూ! దొరికింది.

మనో: (గింజుకుంటూ) ఒరేయ్, ఒరేయ్! ఊపిరాడటంలేదు, వదల్రా...

మధు: (నవ్వుతూ వదిలేశాడు.)

మనో: అమ్మయ్యా, మనస్సు సంగతేమోగాని నిద్రమత్తుమాత్రం పూర్తిగా వదిలిపోయిందిరా. (ముక్కు పట్టుకుని బాధపడ్తూ) అబ్బ! ఎంత గట్టిగా పీకావురా పరాయివాడి ముక్కుని!

మధు: పరాయా? ఊఁహూఁ నా ప్రియమైన ప్రాణస్నేహితుడి ముక్కు.

మనో: అందుకే స్వంత వస్తువులాగ ముచ్చటైన నా ముక్కుని పిండి పారేశావు.

మధు: పారేయలేదు లేవోయె. ఉన్న చోటనే వుంది.

మనో: ఉందా? ఉండనీయ్ పాపం.

మధు: ఒరేయ్ ఫూల్! నా చదువు పాడుచేశావు కదరా.

మనో: ఒరేయ్ యిడియట్! నా స్టడీస్ డిస్టర్బ్ చేశావు కదరా.

మధు: ఆహాఁ! సరే చదువు.

మనో: అయ్యోపాపం పూర్ తుమ్ము! తమ్ముడు లేడని ఎంత బాధపడుతున్నదో!

మధు: చ్. చ్. చ్. ఆ తుమ్ముకి తమ్ముడిలాగ నువ్వెందుకు బాధపడతావు గాని తమ్ముడూ. పరీక్షలు దగ్గిరకొచ్చాయి. చదువుమీద మనస్సు పెట్టి చదువు.

మనో: మనస్సా? (విసుక్కుని) ఓ మనసా! ఏమిటే నీ రభస! మళ్ళీ మొదటకొచ్చాం. సరే, చదవొచ్చులే, ఎప్పుడూ చదివేదేగా! ఒరేయ్ మధూ! ఏవైనా

రచన: విజయబాబు

మనో: సరే చదువు (పుస్తకం తీసుకుని) ఎంతయిందిరా టైం?

మధు: (రిస్టువాచ్ చూసి) టెన్ ఫర్టీ.

మనో: అబ్బ! అప్పుడే అంతయిందిరా? (ఆవలించాడు)

మధు: ఏం అప్పుడే నిద్రా?

మనో: నో, నో దాని ముక్కు పిండి పంపేశావుగా.

మధు: (ఆవులించాడు)

మనో: నీకూ కూడా నిద్రొస్తున్నదన్నమాట.

మధు: నిద్రమత్తు వాడివి ప్రక్కనుంటే రాకేం చేస్తుంది. పైగా ఆవులింతకు అన్నదమ్ములున్నారుగాని తుమ్ముకు తమ్ముడు లేదన్నారు.

కబుర్లు చెప్పరా.

మధు: కబుర్లా?

మనో: (తలాడించాడు ముద్దుగా)

మధు: యింతసేపూ ఆడింది.

మనో: కాలక్షేపం.

మధు: ఓహో! అయితే నీతో కబుర్లు కాలక్షేపాలు చేస్తూ కూర్చోడానికి తీరిక లేదుగాని, నువ్వు హాయిగా నిద్రపోరా నాన్నా.

మనో: ఒరేయ్! ఒరేయ్! పరీక్షలు దగ్గరపడుతున్నాయి. ప్రాణమిత్రుడివి. నిద్రపొమ్మని సలహా యిస్తావా!

మధు: ఒరేయ్ మిత్రమా. కాలక్షేపాల పత్రమా! వీరారెడ్డి సత్రమా! నన్నేమైనా చదవనిస్తావా లేదురా?

మనో: ఒరేయ్ మిత్రమా! గాడిద గాత్రమా! చదువుకోరా నన్నుకూడా చదువుకోనీయ్‌రా. అందుకేప్పైనా నాకబుర్లు చెబితే నా నిద్రకూడా. నీ కబుర్లువింటూ మేలుకునే వుంటుంది.

మధు: నీ నిద్ర కబుర్లువింటూ మేలుకోదురా పది పైసల బఠానీలు తెచ్చుకుని తింటూకూర్చో నీతోపాటు ఆ నిద్ర కూడా తింటూ కూర్చుటుంది.

మనో: ఆఁ! తినడం అంటే జ్ఞాపకం వచ్చింది. ఒరేయ్ ఈ రోజు మా అమ్మ బిరియానీ చేసింది. ఓహ్ ఎంత బ్రహ్మాండంగా వుందను కున్నావ్. అలాగే ప్లేటులో పెట్టించుకుని తెచ్చి నీకు రుచి చూపిద్దామను కున్నాను. కాని వెంటనేను వ్యూ ప్యూర్ వెజిటేరియన్‌వని గుర్తొచ్చి నీ గురద్రుష్టానికి చాల బాధ పడ్డానురా.

మధు: మాంసం తినే వాళ్ళే అదృష్ట వంతులంటావు?

మనో: అసను. కానీ మా అమ్మచేసిన బిరియానీ టేస్టు చేయడానికి నోచుకోని వాడు సెంట్ పర్సెంట్ దురద్రుష్ట వంతుడంటాను. ఒరేయ్! నా కోసం మా అమ్మ ప్రతిరోజు ఏదో ఒక స్పెషల్ చేస్తూనే వుంటుంది. ఏంచేసినా అంత బ్రహ్మాండంగా వుంటుంది. మొన్నపాయసం చేసింది. ఓహ్! వండర్‌ఫుల్! ఆమె చేసిన వంట ఏనాడైనా సరిగ్గా తినక యూనా. ఆరోజు మా అమ్మ మొహం

చూడాలి. ఏడుపొక్కటే తక్కువనుకో ఒక్కొక్కసారి కావాలని ఏడిపిస్తుంటాను మా అమ్మని నామీద మా అమ్మకున్న ప్రేమ ఈ ప్రపంచంలో ఏ తల్లికీ ఏ కొడుకు పైనా వుండదు.

మధు: ఊఁ. అయిందా?

మనో: అప్పుడే అవుతుందిరా! మా అమ్మ గురించి చెబుతూ వుంటే ఎన్ని రోజులైన చాలవు. కాలేజ్ నుంచి ఏ రోజైనా యింటికి రావడం కాస్త ఆలస్యమైందా యిక గుమ్మం దగ్గరే కాపలా! చంటిపిల్లాడ్ని వెతికించినట్లు యింట్లో వాళ్ళందర్నీ వీధిలోకి పంపడం. వీధిలో వెళ్ళే వాళ్ళందర్నీ నా గురించే అడగడం నేను వచ్చి కనిపించిన తర్వాత గాని ఆమె ఆరాటం ఆగదు. ఒక రోజు మా అమ్మ...

మధు: (విసుగ్గా) యిక చాల్లేరా.

మనో: వినరా మా అమ్మ ఒకరోజు ఏంచేసిందంటే...

మధు: ఒకరోజు ఒకరోజు అంటూ అన్ని రోజులూ వినిపిస్తూనే వున్నావు కదరా అరిగిపోయిన రికార్డు లాగ!

మనో: ఆఁహాఁ యిది కొత్త సంగతి ఏమిటంటే మా అమ్మ...

మధు: ఒరేయ్! ప్రపంచంలో నువ్వూ మీ అమ్మా తప్పితే యింకెవరూ లేరేంటిరా?

మనో: ఉన్నారుగాని, వినరా మా అమ్మ...

మధు: ఒరేయ్ నాన్నా! నీకో నమస్కారం, మీ అమ్మకో నమస్కారం గాని దయచేసి నన్ను చదువుకోనీయ్‌రా

మనో: చదువుకోరా కానీ, మా అమ్మ సంగతి విని...

మధు: (కోపంతో అరుస్తూ) షటప్ యిడియట్! వద్దని చెప్తూంటే అర్థం చేసుకునే జ్ఞానం వుండాలి.

మనో: (షాక్ తిని, తర్వాత పెద్దగా నవ్వి) అబ్బ! ఎంతకోపం వచ్చేసిందిరా బుజ్జినాన్నకి! యిడియట్ అంటి యిడియట్! ఫూల్! బ్రూట్! స్కౌండ్రల్! డాంకీ! మంకీ! డుబ్ కీ! డబ్ కీ! ...(అలిసిపోయి) అబ్బ! యిన్ని తిట్టినా నా నిద్రమత్తు వదలలేదేంటిరా!

మధు: నన్ను తిడితే నీ నిద్రమత్తు వదులు తుందన్న మాట!

మనో: యస్!

మధు: యింకా వదల లేదుగా?

మనో: నో!

మధు: అయితేరా వదిలిస్తాను. (చెవి పట్టుకున్నాడు.)

మనో: ఆల్‌రైట్! (అని మళ్ళీ భయంతో వెనక్కి తగ్గి) వద్దురాబాబూ! యిందాక ముక్కుకి మూడింది. యిప్పుడు చెవి ఊడి చేతిలోకి వస్తుంది. దాన్ని మళ్ళీ అతికించి రిపేరు చేయాలంటే చాల పెద్దపని. నువ్వు బుద్ధిగా బుద్ధిమంతుడిలా చదువుకో నేను మత్తుగా గమ్మత్తుగా నిద్రపోతాను.

మధు: అయినా నీకు నిద్రెలా పడ్తుందిరా! దోమలు కుడుతూ, గాలిలేక యింత ఉక్కపోస్తుంటే...


మనో: దోమలా! నిద్రపోయేవాడికి దోమలొక లెఖ్ఖా! ఆనాడు మా పెద్దన్న కుంభకర్ణుడు నిద్రపోతూ వుంటే, శూలాలతో పొడిస్తేనే లేవలేదు. ఈ నాడు నేను, ఆఫ్‌ట్రాల్ దోమలు కుడితే లేచిపోతే (చేతిమీది దోమని కొట్టాడు) అన్నట్లు ఈ సంగతి విన్నావురా?

మధు. ఏ సంగతిరా?

మనో: నీ లవ్, యింతి, వాసంతి...

మధు: నా లవ్వా? ఏం, ఒళ్ళు యిన్సూర్ చేశావా?

మనో: ఆc ఆc కాదులే నువ్వామెను ప్రేమించడం లేదుకదూ! వన్‌వే ట్రాఫిక్‌లాగ ఆమె నిన్ను ప్రేమించే స్తుందిలే గాని, అసలు విషయం వినరా! ఆ వాసంతిగారికి యింజెక్షన్ యివ్వడమంటే చాల భయం కానీ, రాత్రి డ్యూటీలో ఎవరో పేషెంట్‌కి యింజెక్షన్ యివ్వాల్సి వచ్చి భయపడుతూంకి మూడు పోట్లు పొడిచి, నాలుగోపోటు, వీన్ దొరికిందనుకుని యింజెక్షన్ యిస్తే-కాస్సేటికి ఆ మందు ఎక్కక ఆ పేషెంట్ చెయ్యి యింత వాచిపోయిందంట! పాపం, ఆ పేషెంట్ బాధ ఆ పరమాత్ముడికి తెలియాలి. ఆc- చెప్పొచ్చేదేమంటే, యిన్ని సంవత్సరాలు మెడిసన్ చదువుకునే మనిలాంటి డాక్ట




ర్లకంటే, ఆ దోమలే ఎంత నైస్‌గా, నదురూ బెదురూ లేకుండా, నొప్పి లేకుండా యింజెక్షన్లు యిస్తాయి. కాబట్టి అవే మన కంటే తెలివైనవి, గొప్పవీని!

మధు: మరింకేం. నీ రీసెర్చి పైన థీసిస్ వ్రాసి డాక్టరేట్ సంపాయించు

మనో: వద్దులే ముందీ డాక్టరు కానీయ్, ఆ తర్వాత ఆ డాక్టరేట్,

మధు: ఈ రేటులో చదివితే ఆ డాక్టరేట్ వచ్చినట్లే!

మనో: ఏ రేటులో చదివినా నేను తప్పకుండా డాక్టర్ని అవుతానని నా జాతకంలో వుంది గాని, ఒక చిన్న డౌటురా.

మధు: (విసుగ్గా) ఏమిటిరా?

మనో: నీకు ఆడపురుగంటేనే పడదు కదా, మరి నీ రూంలో యిన్ని ఆడ దోమలతో...

మధు: అవి నువ్వొచ్చిన దగ్గర్నుంచే ఎక్కువైనయిరా! దయచేసి వాటిని కూడా నీతో పాటే తీసుకుపోవా బాబు,

మనో: ఈజ్ యిట్? దట్సాల్ రైట్ ఐ విల్ టేక్ దెం ఎవే. డోంట్ ఫియర్ అభయ హస్త మిచ్చితి.

మధు: కృతార్థుడ నైతిని.

మనో: అట్లయిన నేను చరితార్థుడ నైతిని వచ్చెదగాక.

మధు: మళ్ళీ రావొద్దు, పోరా నాన్నా!

మనో: వెళ్తున్నా, (వెళ్ళబోయి తిరిగొచ్చి) అది సరేగాని, పాపం ఆ వాసంతి నీ మీద కన్నేసి కలవరిస్తూందే మరి నీ కన్ను కాస్త తెరవకూడదురా?

మధు: (కళ్ళు వేలితో విప్పి చూపించి) తెరిచానురా.

మనో: అది కాదురా బ్రహ్మచారీ! నీ కోసం ఆ కాంత అంత తపస్సు చేస్తున్నదే కొంత కరుణించి వరం ప్రసాదించ కూడదురా?

మధు: వరాలిచ్చేది దేముడి పనిరా!

మనో: ఆమె పాలిటికి నువ్వేకదరా దేముడూ, రాముడూ, నవమన్మథుడూ అన్నీని...

మధు: ఒరేయ్! దెయ్యంలాగ పట్టుకుని వదలవేంరా!

మనో, వదుల్తాగాని, ఒరేయ్! ఆ మహేష్‌గాడు నీ నిగ్రహ శక్తిని, నీ ప్రిన్సిపల్సుని తారుమారు చేస్తానని, ఆడదానికి లొంగని మగవాడు లేడని, అన్ని కబుర్లు చెప్పి, నీ మీద పంతం పట్టి కంకణం ధరించాడే మరి యింత వరకూ నీ వ్రతభంగం చేయడానికి ఏ ఊర్వసినీ, మేనకనీ పంపించి ప్రయత్నం చేయలేదేం?

మధు: అది వాన్ని అడగాల్సిన ప్రశ్నరా! అయినా నా వ్రతభంగం చేయడానికి అలాంటి మహేష్‌లు వంద మంది పంతం పట్టి వెయ్యి ప్రయత్నాలు చేసినా నెగ్గలేరు. నా నియమాల్ని, నిశ్చయాన్ని ఎవ్వరూ మార్చలేరు. నా మనస్సు కొన్ని విషయాల్లో ఎంత కోమలమో, కొన్ని విషయాల్లో అంత కఠినం అని తెలుసుకో.

మనో: ఒరి కఠినమా! కఠోరం. నీ సంగతి నాకు తెలీదూ? అయినా ఎందుకురా అంత కఠిన శిక్ష. కాదు కాదు దీక్ష?

మధు: తర్వాత చెప్తాగాని, నువ్వెళ్ళి విశ్రాంతి తీసుకోరా బాబూ!

మనో: అలాగేలేరా పోతున్నా నిద్రపోతున్నా (వెళ్ళబోయాడు)

మధు: మనూ! మనూ! ఆగరా. యిక్కడి దోమ కొరసానుల్ని తీసుకెళ్తానన్నావు కదరా!

మనో: దోమ కొరల్ని యిక్కడే వుంచనా?

మధు: తప్పమ్మా! వాటికి ఎడబాటు కలిగించకు.

మనో: సరే కమాన్ మైడియర్ మస్కిటోస్! దోమ కొరల్లారా! కొరసానులారా! రండు. నేను శయనించెద కుంభకర్ణుడిలా అపర కర్ణుడిలా నా రక్తము దానము చేసెద రండు. ఎటెన్షన్! మార్చ్! లెఫ్ట్! రైట్! లెఫ్ట్! రైట్!(అంటూ లోపలికి వెళ్తూన్నాడు.)

మధు: స్వీట్ డ్రీంస్!

మనో: (ఆగిపోయి, తిరిగొచ్చి) ఆఁ డ్రీంస్ అంటే గుర్తొచ్చింది. నిన్న రాత్రంతా అందమైన అప్సరసల్లాంటి అమ్మాయిలు నలుగురు...

మధు: ఎక్కడ?

మనో: కలలో!

మధు: కలలో కనిపించినా నీకు సంతోషమేగా!

మనో: ఏం సంతోషం! ఆ కలలో ఆ అమ్మాయిలతో పాటు నేను కూడా అమ్మాయి లాగ కనిపిస్తే!

మధు: చ్-చ్-చ్ ఈ రాత్రి అబ్బాయిలాగే కనిపిస్తావులే, వెళ్ళు.

మనో: (సంతోషంగా) థేంక్యూ:- కానీ యింకో డౌట్రా ఆ అమ్మాయిలు కూడా అబ్బాయిల్లాగ కనిపిస్తే...

మధు: అది నీ ఖర్మ పోరా!

మనో: (అలాగా అన్నట్లు తలాడించి) ఓ.కే (అంటూ వెళ్ళాడు లోపలికి)

మధు: (నవ్వుకుని) సిల్లీ ఫెలో!

(పుస్తకం తీసి చదువుతూ కూర్చున్నాడు. తర్వాత కుజా దగ్గరి కెళ్ళి, గ్లాసులో నీళ్ళు పోసుకుని త్రాగాడు. మళ్ళీ కుర్చీలో కూర్చుని చదువుతూ వున్నాడు. దూరంగా కుక్కలు మొరిగాయి. మధు విసుక్కున్నాడు. కొన్ని క్షణాల తర్వాత తలుపు బాదిన శబ్దం. మధు విసుక్కుంటూ లేచి)

మధు: అబ్బబ్బ! పిరికి సన్నాసి! కుక్కలు మొరిగినా భయమే!

(లోపలి తలుపు తీయబోయాడు. బయట తలుపు బాదిన శబ్దం అయ్యేసరికి, తన పొరపాటు తెలుసుకుని, వెళ్ళి బయటి తలుపు తీశాడు. శారద, భయంతో అలసటతో రొప్పుకుంటూ పరుగెత్తుకు వచ్చి, మధుని ప్రాధేయపడుతూ)

శారద: రక్షించండి. రక్షించండి. ప్లీజ్ హెల్ప్,

మధు: ఎవరు? ఎవరు మీరు?

శారద: రౌడీ! ఎవడో రౌడీ అండీ! వెంటబడ్డాడు. నన్ను... (చెప్పలేక కంగారుగా లోపలి గదిలోకి పరుగెత్తింది.)

మధు: ఏయ్! లోపలి కెళ్ళొద్దు. విషయమేమిటో సరిగ్గా చెప్పు. ఏయ్! (ద్వారం వరకూ వెళ్ళి) బయటికిరా! ఊఁ రమ్మంటే.

శారద: (భయం భయంగా వచ్చి) నన్ను కాపాడండీ ఏమండీ! నన్నెక్కడైనా దాచేయండి. ఆరౌడీ నాప్రాణాలు తీస్తాడు.

మధు: ఎవడా రౌడీ? ఎక్కడున్నాడు?

శార: ఎవడోనండీ, నన్ను తరుముకుంటూ వస్తున్నాడు.

మధు: (బయటికి వెళ్ళి చూసి తిరిగొచ్చి) ఏడీ, ఎవరూ లేరే!

శార: వస్తున్నాడండీ. వీధిలో దీపాలు లేక పోవడం...

మధు: కనిపించ లేదంటావు! మరి వచ్చే అలికిడి కూడా లేదే! (నవ్వి,)

హుఁ నీ నాటకం నా దగ్గరకాదు. ఏదో సాకు చెప్పి, నా మనస్సుని ఆ కట్టుకుని యిక్కడ తిష్ట వేయాలని, నన్ను ఫూల్‌ని చేయాలని ప్రయత్నించవద్దు. ఈ యింటిలో ఆడ పురుగుకూడా వుండడానికి వీల్లేదు. మర్యాదగా బయటికి నడు. ఊఁ.

శార: అయ్యో! ఎక్కడికి పోయేదండీ. అంతా చీకటి ఈచుట్టు ప్రక్కల వేరే యిల్లు కూడా లేదు. ప్రాణాలకు తెగించి పరుగెత్తుకొచ్చి ఎలాగో యిక్కడికి చేరుకున్నాను. ఆ రౌడీ బారి నుండి తప్పించుకున్నాను. నా మాట నమ్మండి, నేను అబద్ధం చెప్పడం లేదండీ.

మధు: అంతా నిజమే చెబుతున్నావు, నిజమే. మరి నిన్ను తరుముకుంటూ నీ వెంటే వచ్చిన ఆ విలన్ యింతలో ఎక్కడికెళ్ళి పోయాడో! నువ్వీ యింటిలో దూరుతూనే వాడు జారుకున్నాడా? నీ మాయ మాటలు నా దగ్గర కాదు. నీలాంటి వగలాడుల వలలో చిక్కుకునే వాడిని కాదు. బయటికి పో! ఊఁ!

శార: అయ్యో భగవంతుడా! ఏమండీ! నా మాట నమ్మండి. నిజంగానే నన్నొక దుర్మార్గుడు తరుముతూ వచ్చాడండీ! మాది ఈ ఊరుకాదండీ, విశాఖ పట్నం అండీ!

మధు: ఊఁ ?

శార: అవునండీ ఉద్యోగం కోసం మద్రాసు బయలుదేరాను. ట్రైన్‌లో ఆ రౌడీ పరిచయమై, తన ఫ్రెండ్ యిక్కడ ఏదో కంపెనీలో డైరెక్టరుగా వున్నాడని, అతనితో చెప్పి నాకు ఉద్యోగ్యం యిప్పిస్తానని చెప్పాడండీ, పైగా, అతని భార్య నాలాంటి వాళ్ళని ఎంతో సంతోషంగా ఆదరిస్తుందనీ చెప్పాడు. అతని మాటలు నమ్మి వాళ్ళయింటికొస్తే!, అతనికి భార్యలేదని. అతను చెప్పిదంతా అబద్ధమనీ తెలిసిందండీ. ''మీకు భార్య వుందని, నన్ను ఆదరిస్తుందనీ చెప్పారు కదా?'' అంటే, ''మన యిద్దరికీ మధ్య అడ్డంగా యింకొక భార్య ఎందుకు? నీకు వేరే ఉద్యోగం ఎందుకు? నా తోనే వుండిపో, నీ కోరికలన్నీ తీరుస్తాను, నా కోరికా తీర్చు'' అంటూ నన్ను బలవంతం చేయబోయాడండీ! ఎలాగో తప్పించుకుని బయట పడివచ్చాను. ఏమండీ! ఈ సమయంలో నన్ను బయటికి పొమ్మనకండి. ఈ ఒక్క రాత్రి తలదాచుకోనీయండి. మీ మేలు ఎన్నటికీ మరచిపోనండి.

మధు: (నవ్వి) కథ చాల బాగుంది. బ్రహ్మాండంగా నమ్మతగినట్లుగానే అల్లావు అందుకే అన్నారు. ఆడది అబద్దాలాడక పోవడం. సముద్రంలో నీరు లేక పోవడం సంభవం కాదని. అందులోనూ నువ్వు చాలా ఎక్స్‌పీరియన్సుడ్ హేండ్‌లాగున్నావు.

శార: అబద్దం కాదండీ! నే చెప్పిందంతా నిజమండీ. ప్రమాణం చేసి...




మధు: పటప్! (గట్టిగా అరిచాడు.)

శార: (బెదరి పోయింది.)

మధు: (ఆమె దగ్గరికి నవ్వుతూ వెళ్తూ) ఎవరు? ఎవరు పంపారు నిన్ను? ఎవరు నేర్పారు? చెప్పు ఫర్వాలేదు చెప్పు.

శార: నేర్పడం ఏమిటండీ! నన్నెవరు పంపలేదు, నేనే ఆ దుర్మార్గుణ్ని తప్పించుకుని యిక్కడికొచ్చానండీ.

మధు: ఓహో! తప్పించుకొచ్చావ్! చ్ చ్ చ్_ అక్కడెవడో బలవంతం చేస్తే యిక్కడికి తప్పించుకొచ్చావు. బాగుంది మరి, యిక్కడ నేను బలవంత చేయనని ఏమిటి నమ్మకం?

శార: ఆ! (భయపడి ప్రక్కకి తప్పుకుంది.)

మధు: నేనెవర్నో, ఎలాంటి వాడినో నీకు తెలీదు. నిన్నురక్షిస్తానని, నీ శీలాన్ని కాపాడుతానని ఎలా అనుకున్నావు? నేను కూడా యౌవనానికి దాసుడనై, కామానికి బానిసనై నీ మానాన్ని కోర నని ఏమిటి గ్యారంటీ? నేను కోరినా ఫర్వాలేదు కదూ? అదే నీ కోరిక కదూ? నా నియమాల్ని, నీతినీ గోతిలో కలపడమే నీ ధ్యేయం కదూ? అందుకే యింత రాత్రివేళ పనికట్టు కొచ్చావు కదూ?

శార: (భయపడి వెనక్కి పోతూ, నోట మాటరాక, ఊరికే ఏడుస్తూవుంది.)

మధు: (నవ్వి)నీలాంటి పడుపుకత్తెలు వెయ్యి కథలు చెప్పినా నమ్మేవాణ్ని కాదు. నీ వగలూ, కన్నీరు నన్ను వశ పర్చుకోలేవు. నన్ను మార్చాలని పంపిన

ఆ మహేస్‌లాంటి మూర్ఖులు ఎందరు ప్రయత్నించినా నా మనస్సు జారదు. పో గెట్ఔట్! (అరిచాడు.)

శార: (అయోమయంగా, భయంగా, ఏడుస్తూ వెనక్కి పోతూ ఆగింది.)

మధు: (కోపంగా, ఆమెని బయటికి పొమ్మని చూపిస్తూ) ఊఁ!

శార: (యిక లాభం లేదనుకుని, ఏడుస్తూ బయటికి నడచి, వెంటనే తిరిగొచ్చి కంగారుగా) అదిగో, వాడేనండీ! వచ్చేశాడండీ. ఏమండీ! యిప్పుడైనా మాట నమ్మండి నన్ను కాపాడండీ. [అంటూ టేబిలు చాటుకు వెళ్ళి, వెంటనే లోపలికి పరుగెత్తింది. మధు వీధి వైపు చూశాడు. శారద వైపు ద్వారం వరకూ వెళ్ళి చూశాడు. తిరిగి వీధివైపు వెళ్ళబోయాడు. రాజారావు లోపలికి వస్తూ దభాలున క్రింద పడబోతూ మధు పైన పడి ఆగి మధుని చూచాడు. మనిషి పూర్తిగా తాగివున్నాడు. మధుని పోల్చుకుని)

రాజారావు: మధూ!

మధు: రాజా! నువ్వా!

రాజా: నేనేరా రాజాని. రాజాధిరాజాని! కనబడటం లేదేంటిరా గుడ్డి సన్నాసీ! లైటేసుకో ఆఁ_ఒరేయ్ మధూ! యిటువైపొక చిలకొచ్చిందిరా. బ్రహ్మాండమైన బుల్ బుల్! నీ గదిలోకేమైనా వచ్చి వాలిందేమిటిరా? ఆఁ? ఈ చుట్టుప్రక్కలంతా వెతికాను. ఎక్కడా కనిపింపలేదు. బలే తెలివిగా తప్పించుకుందిరా! ఏమిటిరా అలా చూస్తావు మొద్దూ, అడుగుతూంటే జవాబు చెప్పకుండా!

మధు: రాజా! ఏమిటిరా యిది! నువ్వు తాగావా?

రాజా: అబ్బె ఓకేసారి ఏకంగా తాగలేదురా కొంచం కొంచం సిప్ చేశాను, ఆ చిలుక చేతికి చిక్కేసరికి కొంచం ఎక్కువగానే సిప్ చేశాను. ఆ కలర్‌ని కిస్ చేద్దామనుకుంటే పట్టుజారి పారిపోయింది. యిక్కడేమైనా దూరిందా? నువ్వు దాచావా? ఒరేయ్! నాకివ్వవా?

మధు: రాజా! పెళ్ళి చేసుకున్న వాడివి, నువ్వుకూడా...

రాజా: చేసుకున్నారా. కానీ ఏం లాభం? నా పెళ్ళాం సంగతి నీకు తెలీదురా. పెళ్ళయిన ఈ ఆరునెలల్లో అరవై ఆరు సార్లు వెళ్ళొచ్చానురా వాళ్ళింటికి కన్న వాళ్ళపైన మమకారం వదలక అది ఆ యిల్లు వదలనంటూంది. ఏం చేసేది? నేనేం చేసేదిరా? నా కంటే వాళ్ళ అమ్మే ఎక్కువరా దానికి. ఆఁ దాని పిలుపు కెళ్ళి వస్తుంటేనే ట్రైన్‌లో తగిలిందిరా ఆ పిల్ల పిల్లంటే పిల్లకాదురా పంచదార చిలకనుకో! మంచి పాకంలో వుంది. బలే కలర్! ఒరేయ్ మధూ! యిటే వచ్చిందిరా. చెప్పరా పిల్లబాగుందని నువ్వేమైనా దాచావా? ఊఁ...

(సశేషము)

# మనసుజారితే

## (కేంద్రప్రభుత్వం అవార్డు పొందిన నాటకం)

**(గత సంచిక తరువాయి)**

రాజా: ఊఁ చెప్పవూ? సరే, నేనే వెదుకుతానులే నువ్వు మొకమాట పడుతున్నట్టున్నావు (లోపలికి నడుస్తూ) ఎక్కడున్నావే పిల్లా ఎక్కడున్నావే! (పాడాడు.)

మధు: రాజా! (వారించబోయాడు.)

(రాజారావు, మధుని నెట్టి లోపలి కెళ్ళాడు. శారద చాటుగా వచ్చి, మధుని కాపాడమన్నట్టు సైగతో ప్రార్థించింది. మధుకి ఏం చేయాలో తోచక లోపలికి చూసి శారదతో,)

మధు: వెళ్ళిపోండి. యిక్కడ నుండి పారిపోండి.

శార: ఏమండీ! అంతా చీకటిగా వుందండీ. ఈ చుట్టుప్రక్కల మరో యిల్లు కూడా లేదు. చాల భయంగా వుందండీ. నన్నెక్కడైనా దాచేయండి.

మధు: ఇక్కడ మిమ్మల్ని దాచటానికి రహస్య స్థలాలూ, సొరంగ మార్గాలు లేవు. నిజంగా తప్పించుకోవాలని వుంటే వెంటనే యిక్కడ నుంచి పారిపోండి ఊఁ.

శార: సరేనండి. వస్తానండీ. (కన్నీళ్ళతో బయటికి పోబోతున్నది.)

రాజా: (లోపలినుండి వస్తూ) ఆగు!

శార: (ఆగిపోయింది భయంగా)

రాజా: (మెల్లగా తూలుతూ ఆమె దగ్గరి కెళ్తూ)జారిపోయిందన్న కుందేలు వంటింట్లో దూరిందన్న మాట! భళే. యింక ఇప్పుడెక్కడికీ తప్పించుకో లేవు గాని నా బ్యూటిఫుల్ బుల్‌బుల్! పారిపోవాలని ప్రయాస పడకే రాణీ, నా గుండెల్లో గూడుకట్టుకోవే. నా హృదయాకాశంలో స్వేచ్ఛగా,హాయిగా విహరించే.

శార: (భయంగా మధు చాటుకు పోతూవుంది)

రాజా: ఓ నా రామచిలకా! జారి పోకే నామనస్సు కోయబోకే రా! నాతో కాస్సేపు లవ్వాడే నా గువ్వా! దా,దా! (బుజ్జగిస్తూ పిలిచి, కోపంగా) ఊఁ మంచిగా పిలుస్తుంటే రావేమే దెయ్యమా! నీలాంటి రంగేళీ రవ్వల్ని వివాహమే

చేసుకోవాలి, (ఆమెని వెంటతరిమి పట్టుకున్నాడు.) ఇప్పుడెక్కడికి వెళ్తావు! రా, స్వర్గలోకానికి దారి చూపిస్తాను. విలన్ లాగ వీడిక్కడ అడ్డమున్నాడు. రా, దూరంగా వెళ్ళిపోయి ఆ చీకటిలో కలిసి పోదాం.

[రాజారావు, శారదని బలంగా పట్టుకుని లాగుతున్నాడు. శారద, గింజుకుంటూవుంది. మధుకు ఏం చేయాడానికీ తోచక ఆగిపోయాడు. శారద, బలంగా రాజారావుని త్రోసేసి, మధు దగ్గరికొచ్చి)

శార: ఏమండీ! నన్ను రక్షించండి. నిస్సహాయురాల్ని, ఆడదాన్ని. అన్న లాంటివారు. మీ కళ్ళెదుటే మీ చెల్లెన్ని యిలా ఎవరైనా బలవంతం చేస్తూవుంటే ఊరుకోగలరా? ఏమండీ! నన్ను కాపాడండి!

(శారద; "అన్నయ్య లాంటివారు" అనే సరికి, మధులో మార్పు కలిగింది. యింతలో రాజారావు వచ్చి, శారదను పట్టుకోబోయాడు. శారద, 'అన్నయ్యా'! అంటూ మధు కాళ్ళపై పడింది. మధు రాజారావు చేతిని పట్టుకుని ఆపి, రెండో చేతితో శారదను లేవదీస్తూ.)

మధు: లేమ్మా! నేనుండగ నీకే హానీ జరగదు. భయంలేదు లేమ్మా!

శార: (లేచి సంతోషంగా అతని దగ్గరికి జరిగి) అన్నయ్యా!

రాజా: (పెద్దగా నవ్వి) అన్న చెల్లి! ఓహో! ఆహా! తోడబుట్టిన చెల్లెలి లాగ అన్నచాటు కెళ్ళావా పిల్లా! ఆదేం లాభంలేదు. ఆ అన్నకి ఆడదంటే పడదు వాడితో ఎందుకు! రా, నేనే నీకు ఈడు జోడు. (ఆమె పైకి వెళ్ళబోయాడు)

శార: అన్నయ్యా! (మధు చాటు కెళ్ళింది.)

మధు. ఒరేయ్, రాజా! ఆగరా, ఆగు

రాజా: నో నో స్టాపింగ్ ఎక్స్ప్రెస్ కాదు మెయిల్ నోనో రాకెట్ లాగ వెళ్ళిపోతాం మే మిద్దరం నువ్వు చూస్తూ వుండు!

మధు: ఒరేయ్! నా మాట వినరా!

రాజా: వినను, ఒరేయ్! నా కలర్ ని నువ్వు కాజేయాలని పావేస్తున్నావు కదూ? అది నేను ఒప్పుకోను. ఒప్పుకోనంటే ఒప్పుకోను.

మధు: రాజూ! చదువుకున్న వాడివి' సంస్కారం గలవాడవి, పెళ్ళిచేసుకున్న వాడివి, నువ్వుకూడా...

రాజా: ఎవడ్రా వీడు? పెళ్ళిచేసుకుంటే ఏంరా? పెళ్ళాం అడ్డొస్తుందా? పెళ్ళి చేసుకున్న వాళ్ళంతా ఒక్క పెళ్ళాంతోనే కాపురం చేస్తున్నార్రా? పిచ్చోడ!

మధు: రాజూ! అర్థం కుర్థం తెలియని అమాయకురాలురా!

రాజా: ఆడది కదరా, అలాగే అనిపిస్తుంది.

మధు: అనిపించడం కాదురా. చూడు

రచన: **విజయబాబు**

నిన్ను చూసి బెదరి ఎలా వల్లడిల్లి పోతున్నదో!

రాజా: కొత్తలో అలాగే వుంటుంది లేవోయ్! అలవాటైతే భయం తీరిమనల్నే బెదరగొడ్తుంది. ఆడది అంతేరా బ్రదర్! నీకు తెలీదు. ఆడదాని సంగతి!

మధు: రాజూ! నీ పరిస్థితి యిప్పుడేం బాగలేదు...

రాజా: ఏం? నాకేంరా! ఎక్కడైనా తాగొచ్చానేంటిరా యిలా మాట్లాడుతున్నావివాళ!

మధు: ఒరేయ్! నామాట విని పోయి రెస్టుతీసుకో: ఆమె ఎక్కడకీ పోదు. యిక్కడే వుంటుంది. రేపొద్దున్నే అన్ని విషయాలూ మాట్లాడుదాం.

రాజా: రేపా?! రేపంటూ ఒకటుంటుందో లేదో ఎవడికి తెలుసురా! నువ్వు గ్యారంటీ యివ్వగలవా? నో, యిప్పుడే, ఈ క్షణమే కావాలి. అదినాది కావాలి

మధు: రాజా! ఏమిటిరా ఎప్పుడూ లేనిది ఈవాళ యింత మొండిగా ప్రవర్తిస్తున్నావు! నిస్సహాయురాలైన ఒక ఆడపిల్లని అన్యాయం చేసి ఆమె పవిత్ర జీవితాన్ని నాశనం చేయడం మంచిది కాదురా. క్షణికోద్రేకానికి లొంగిపోయి మనసుజారి, ఘోరమైన పాపాన్ని చేయొదు.

రాజా: (నవ్వుతూ) ఒరేయ్ మధూ! నీతులు చెప్పి నన్ను పంపించేసి నాచిలకని నువ్వు కొట్టేయాలని చూస్తున్నావు కదూ? నీ ప్లాను నాకు తెలుసులే!

మధు: రాజా! నా సంగతి పూర్తిగా తెలిసిన నువ్వు అనాల్సిన మాటలురా యివి? సరే, అంటే అన్నావులే వెళ్ళు, రేపు మాట్లాడుదాం.

రాజా: నో రేపు. టుడే. ఐ వాంట్ హెర్ నవ్ యిట్ సెల్ఫ్. యిప్పుడే కావాలి. (చిన్నపిల్లాడిలా) లెట్ మి ఎంజాయ్ విత్ హెర్!

మధు: (సీరియస్‌గా) నో ఐ ఓంట్ ఎలౌవ్. నేనది జరగనివ్వను.

రాజా: (మధుని నెట్టి) పోరా. మధ్య నువ్వు జరగనిచ్చేదేంటిరా! నిన్నెవరు లెఖ్ఖ చేస్తారు. ఏయ్ పిల్లా! (శారదని పట్టుకోబోయాడు.)

మధు: (అడ్డు నిలిచి) రాజూ! స్నేహితుడివి గనుక యింతగా చెప్తున్నాను. ఆమె కన్యాయం చేయకు 'అన్నయ్యా!' అని కాళ్ళపై పడింది. నేను మాటిచ్చి చేరదీశాను. నా చెల్లెలు నీకు మాత్రం

చెల్లెలుకాదూ? నా చెల్లెలికి అన్యాయం జరుగుతుంటే ఆదుకోవాల్సిన వాడివి, నువ్వే ఈనీచానికి పాల్పడటంమంచిదా?

రాజా: ఎవడ్రా వీడు త్రేతాయుగం కబుర్లు చెప్తాడు. ముక్కూ మొహాం తెలియని ఎవర్తో వచ్చి "అన్నయ్యా!" అని పిలిచిందంట. వీడు అన్నయ్య అయిపోయాడంట! వీడితో పాటు నేను కూడా దీన్ని చెల్లాయ్ అని చేరదీయాలంట! అన్నయ్యా అనిపిలిచే వాళ్ళంతా చెల్లెళ్ళయి పోతే-(నవ్వి) ఒరే మొద్దూ! నువ్వెన్ని నీతులు చెప్పినా దాన్నలా పిలవడానకి నామనస్సు ఒప్పడం లేదురా కావలిస్తే నిన్నే 'బావా!' అనిపిలుస్తాను నాకేం కష్టం వద్దులే. పిల్లని స్తేచాలు సరేనా?

మధు: రాజూ!

రాజా: ఏం, తగనా? నా కంటే మంచి సంబంధం తెస్తా వేంటిరా మీచెల్లెలికి! నా కంటే డబ్బున్నవాడు చదువుకున్నవాడు, నాకంటే... ఆఁ ఎవడు దొరుకుతాడురా! ఒరేయ్! ముసలమ్మ మాటలు మాని నా పిల్లని నాకిచ్చేయి. ఎహే, నువ్వివ్వడం ఏంటి ఆ పిల్లని నేను తీసుకొచ్చాను, అందుకే అది నా స్వంతం, దాన్ని నేనేమైనా చేసుకుంటాను. ఎలాగైనా వాడుకుంటాను. అది నా యిష్టం, ప్లెజర్. (ఆమెని పట్టుకోబోయాడు.)

మధు: (ఆపి) ఒరేయ్ రాజూ! నా మాట వినరా!



రాజా: వినాన్రా వినకంటే వినను యిప్పుడు నువ్వేం చెప్పొద్దు.

మధు: వినవా! యిన్నాళ్ళ మన స్నేహాన్ని ఒక అమ్మాయికోసం, క్షణిక సుఖం కోసం వదులు కుంటావా?

రాజా: ఓ యస్. నిరభ్యంతరంగా, ఈ సుందరికోసం నిన్నేకాదు, ఏమైనా వదులు కుంటాను. నాక్కావలసిందల్లా ఈరసగుల్లా!

మధు: సరే, నువ్వు మన స్నేహాన్ని వదులుకోడానికి సిద్ధపడినా, నేనీమెని విడిచి పెట్టడానికి సిద్ధంగా లేను. నువ్వు వెళ్ళొచ్చు.

రాజా: ఓస్!ఓస్! ఊరికే వట్టి చేతులతో వెళ్తానను కుంటున్నావా! ఈ చిలకని నా చేతి చిటికన వ్రేలిమీద ఎక్కించుకుని జహాంగీరు చక్రవర్తి లాగ వెళ్ళి పోతాను.

మధు: ఈ అక్బరు పాదుషా వెళ్ళనిస్తేగా!

రాజా: మధ్య నువ్వేమిటిరా వెళ్ళనిచ్చేది! బ్రోకరువా, డాఫరువా? నేను దాన్ని తీసుకొచ్చాను. నేనే తీసుకెళ్తాను. (ముందుకు నడిచి శారదని పట్టుకోబోయాడు)

శార: అన్నయ్యా! (మధు చాటుకు వెళ్ళింది)

మధు: రాజూ! (రాజారావుని వెనక్కి నెట్టాడు.)

రాజా: (తూలిక్రింద పడ్డాడు.)

(సమాప్తి) జ్యోతి